కథ

సోమవఝుల నాగేంద్రప్రసాద్

# గురివిందలు

తను ప్రేమించిన చక్రవర్తిని కలవ దానికి వస్తున్న ఉష, లోపల చక్రవర్తి తల్లి అన్నపూర్ణతో ఘర్షణ పడుతున్న ట్లుగా గట్టిగా మాట్లాడుతుండడంతో అక్కడే గుమ్మం దగ్గర ఆగి వారి సంభాషణను వినసాగింది.

"నువ్వేన్నైనా చెప్పమ్మా, నువ్వనుకొన్నట్లు ఉష చెడ్డది, బరితెగించింది కాదు. తెలిసీ తెలియకుండా ఆమె మీద లేనిపోని అభాండాలు వెయ్యకు" ఆవేశంగా అన్నాడు చక్రవర్తి.

"ఎందుకురా అలా ఆ అమ్మాయిని వెనకేసుకొస్తున్నావు. అంత బరితెగించింది కాకపోతే నిన్ను ప్రేమించానంటూ నీ వెంట ఎందుకు తిరుగుతుంది? నువ్వు పిలవగానే తగుదునమ్మా అంటూ ఇక్కడికి ఎందుకు వస్తుంది?" నిలదీసింది అన్నపూర్ణ.

"ఈవేళ కాకపోతే రేపైనా మా ప్రేమ వ్యవహారం మీకు తెలిసేదే కదా, అందుకే మీ అనుమతి తీసుకున్న తర్వాతనే మేమిద్దరం పెళ్ళిచేసుకోవాలనుకొన్నాం, ఆ ఉద్దేశ్యంతోనే ఆమెను మనింటికి పిలిచాను"

"ఓహో నీకు మా అనుమతి తీసుకోవాలనే జ్ఞానం కూడా ఉందన్నమాట! చాలా సంతోషం. అయితే ఈ పెళ్ళికి నేనుగాని మీ నాన్నగాని ససేమిరా వప్పుకోము. ఎవర్తో కులం, గోత్రం తెలియనిదాన్ని నువ్వు ప్రేమించినంత మాత్రాన, మేం వప్పుకోవాలనే రూలేం లేదు. అందుచేత నా మాట విని ఆ అమ్మాయికి నువ్వే ఏదోలా నచ్చ చెప్పి తొందరగా దాని పీడ వదిలించుకో" తన మనసులోని అభిప్రాయాన్ని కుండ బ్రద్దలు కొట్టినట్లుగా చెప్పింది.

"ఏంటోయ్ మీ తల్లీ కొడుకులిద్దరూ ఏదో విషయమై హాట్ హాట్‌గా మాట్లాడుకొంటునట్లున్నారు" తన రూములో నుండి బైటికి వస్తూ అన్నాడు చక్రవర్తి తండ్రి రామారావు.

"వీడు చేసిన నిర్వాకం తెలిస్తే మీకూ వళ్ళు మండుతుంది" వ్యంగ్యంగా అంది అన్నపూర్ణ.

"అంత కానిపనేం చేసేవురా?" కొడుకుని అడిగాడు రామారావు.

"ఏంలేదు నాన్నగారు. నేనొక అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళిచేసుకొంటాను అంటే అమ్మ వప్పుకోవడం లేదు"

"అంటే మీ మానాన మీరు ప్రేమించేసుకుని మా పెళ్ళికి ఒప్పుకోండి అంటే మేం గంగిరెద్దుల్లా తలాడించాలా" కొడుకువంక సీరియస్‌గా చూస్తూ అన్నాడు.

"అదీ అలా అడగండి" ఇంకా అతణ్ణి ఎగదోస్తూ అంది అన్నపూర్ణ.

"సరే నేను వాడితో మాట్లాడతాను గాని కొంచెం టీ చుక్క పోయగూడదా తల పగిలిపోతోంది" అక్కడ నుండి ఆమెని పంపించే ప్రయత్నం చేసాడు రామారావు.

"ముందర ఈ విషయం ఏదో తేలనివ్వండి, అప్పుడే ఏదైనాను" అంది కోపంగా.

"ఇందులో చెప్పడానికేముంది. ఈ యింట్లో నీ మాటని నేనుగాని, వాడుగాని ఎప్పుడైనా కాదన్నామా. నీ మాటంటే మాకు శిలాశాసనమే కదా" వేడెక్కిన వాతావరణాన్ని తేలిక చెయ్యడం కోసం నవ్వుతూ అన్నాడు.

"మీరు అంతగా నటించాల్సిన అవసరం లేదు. పైకి అలా అంటారే గాని, మీ యిద్దరికి నా మాటంటే అసలు లక్ష్యమే లేదు. మీరు ఏం చెయ్యదల్చుకొన్నారో అదే చేస్తారు గాని నా మాట ఎప్పుడు విన్నారు కనక" అంది మూతిముడుచుకుంటూ.

"చెప్పరా ఇప్పుడే మీ అమ్మతో ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోనని" చక్రవర్తిని బలవంతపెడూతూ అన్నాడు రామారావు.

"నాన్నా... నేను ఆ అమ్మాయిని ప్రేమించింది ఏదో కాలక్షేపం కోసమూను, వంచించి మోసం చెయ్యడం కోసం కాదు. పెళ్లంటూ చేసుకొంటే ఆ అమ్మాయినే చేసుకొంటాను" చక్రవర్తి నిర్భయంగా తన నిర్ణయాన్ని తెగేసి చెప్పాడు.

"అలాగంటే ఎలారా నీమీదే ఎన్నో ఆశలు పెట్టుకొని బ్రతుకుతున్నాం. ఇప్పుడు నువ్వేమో నేను ప్రేమించిన అమ్మాయినే పెళ్ళి చేసుకుంటాను. మీ యిష్టంతో నాకు సంబంధం లేదంటే ఎలా? మా పరువేంగాను" రామారావు నచ్చచెప్పబోయాడు.

"మీకా గౌరవం ఇచ్చేకదా మీ అనుమతిని అడిగింది. నేను కావాలంటే ఆ అమ్మాయిని ఏ గుళ్ళోనో పెళ్ళి చేసేసుకుని తర్వాతే మిమ్మల్ని ఆశీర్వదించమనొచ్చుకదా"

"నువ్వన్నది నిజమే అనుకో. ఐనా కన్న తల్లితండ్రులుగా మా ఆశల్ని అభిప్రాయాలను గౌరవించవలసిన బాధ్యత నీకుందిగా"

"అందుకే కదా నాన్నగారు ఈరోజు ఆ అమ్మాయిని రమ్మన్నాను" ఉషని పిలిచిన సంగతి తండ్రికి తెలియజేసాడు చక్రవర్తి.

"నువ్వేన్నైనా చెప్పు కులం, గుణం లేని అమ్మాయిని ఈ యింటి కోడలిగా అంగీకరించడానికి నేనుగాని, మీ నాన్నగాని సిద్ధంగా లేము" మధ్యలో అంది అన్నపూర్ణ.

"నువ్వుండు అన్నపూర్ణ నేను వాడికి నచ్చ చెపుతున్నానుగా" రామారావు సర్ది చెప్పబోయాడు.


"ఏంటి నాన్నగారు ప్రేమించి పెళ్ళి చేసుకోవడం ఏదో తప్పు అన్నట్లు మాట్లాడుతున్నారు. నన్నో సంతలో పశువులా భావించి నాకు ఇష్టంలేకపోయినా ఎవరో ఒకరిని చూసి పెళ్ళి చేసేస్తారా. అలా చేస్తే నేను సుఖంగా ఉండగలనా? ఏమాత్రం ఇష్టపడని నాతో, ఆ వచ్చిన అమ్మాయి మాత్రం ఏం సుఖపడుతుంది? ఇష్టం లేని పెళ్ళి చేసుకొనే కన్నా అసలు పెళ్ళే చేసుకోకపోవడం ఉత్తమం"

"చూడు బాబు నువ్వెన్ని చెప్పినా మేం ఈ పెళ్ళికి వప్పుకొనేది లేదు. అందుచేత ఆ అమ్మాయిని మర్చిపోయి హాయిగా మేం కుదుర్చిన సంబంధాన్ని చేసుకుంటే మంచిది. నా లెక్క ప్రకారం ఆ అమ్మాయి నిన్నుగాదు నీ ఆస్తిని నీ ఉద్యోగాన్ని చూసి ప్రేమించి ఉంటుంది, నీతో అంతలా బరితెగించి తిరిగిందంటే ఆ అమ్మాయి క్యారెక్టర్ ఎటువంటిదో వేరే చెప్పనవసరం లేదు" ఉష అంటే ఏవగింపు కలిగించాలని మరొక్కసారి ప్రయత్నం చేసారు రామారావు దంపతులు.

"మీరెన్ని చెప్పినా నా నిర్ణయంలో మార్పుండదు. మీరు మా పెళ్ళికి మనస్ఫూర్తిగా ఒప్పుకొన్నారా సరే లేకుంటే ముందు చెప్పినట్లుగా ఏ గుళ్ళోనో పెళ్ళి చేసుకొని ఆ అమ్మాయితో వేరే కాపురం పెట్టాల్సి వస్తుంది" విసురుగా తలుపుతీసుకొని బైటికి వచ్చేసాడు చక్రవర్తి.

అనుకోకుండా అలా చక్రవర్తి సడన్‌గా బైటికి రావడంతో ఉలిక్కిపడిన ఉష, అతని మొహం చూడలేక

ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన



చక్రవర్తి ఎంత పిలుస్తున్నా వినిపించుకోకుండా వాళ్ళ మాటల్నే తల్చుకొంటూ ఏడుస్తూ తన యింటివైపు పరుగుతీసింది.

ooo

"ఏమైందమ్మా" కాలేజినుండి ఏడుపు మొహంతో వచ్చిన కూతురు రమ్యని కంగారుగా అడిగింది అన్నపూర్ణ.

"ఏం లేదమ్మా" విషయాన్ని దాటేయబోయింది రమ్య.

"ఏమీ లేకపోతే ఎందుకలా ఏడుపుమొహంతో వచ్చావు" అన్నపూర్ణ తిరిగి ప్రశ్నించింది.

"అబ్బా ఏంలేదన్నానుగా, నన్ను కొంచెం ప్రశాంతంగా ఉండని" తల్లిమీద విసుక్కుంది రమ్య.

"నేను ఏవన్నానని నీకంత కోపం. వయసులో ఉన్న ఆడపిల్లవు, నీకు జరగకూడనిది ఏదైనా జరిగిందేమోనని ఆదుర్దాగా అడిగాను తప్పా?"

"అమ్మా ఎన్నిసార్లు చెప్పాలి ఏం జరగలేదని, విసిగించకుండా ఇక్కడినుండి వెళ్ళు నీకు దణ్ణం పెడతాను ప్లీజ్"

"ఏం జరిగిందమ్మా" రూములో పేపరు చదువుకొంటున్న చక్రవర్తి తల్లిగొంతు విని బైటికి వస్తూ అడిగాడు.

"ఏమో నాయనా నాకు మాత్రం ఏం తెలుసు. కాలేజి నుండి ఏడుపు మొహంతో వస్తే ఏం జరిగింది తల్లీ అన్నాను, దానికే నామీద విరుచుకుపడుతోంది మీ చెల్లి"

"సర్లే అమ్మా! విషయం నేను కనుక్కొంటానుగాని నువ్వేం టెంషన్ పడకుండా నీ పనులు చూసుకో"

"ఏమో నాయనా దాని వాలకం చూస్తుంటే నాకేదో భయంగా ఉంది. నువ్వే ఎలాగైనా విషయం కనుక్కో" అక్కడ నుండి వెళుతూ అంది అన్నపూర్ణ.

"అలాగే" అప్పటికప్పుడు తల్లికి నచ్చచెప్పి అక్కడ నుండి పంపించేసి తేలిగ్గా ఊపిరి పీల్చుకొన్నాడు చక్రవర్తి.

ooo

"ఏవండి ఎందుకండి మన చక్రవర్తి ఇలా తయారయ్యాడు. ఇటువంటివి మన ఇంటావంటా ఎక్కడా లేవు కూడాను. ఎవరి బుద్ధులు వచ్చాయో ఏమో" భర్తకి టీ ఇస్తూ అంది అన్నపూర్ణ.

"ఎవరివో ఎందుకు వస్తాయి. ఉన్నాడుగా మీ తమ్ముడు, వీడిలాగే ఎవర్తినో ప్రేమించి పెళ్ళి చేసుకోలేదు. బహుశా మేనమామ పోలికలు వచ్చి ఉంటాయి"

"మీరు కూడా నన్ను మీ పెద్దవాళ్ళని ఎదిరించే కదా పెళ్ళి చేసుకున్నారు" నవ్వుతూ అంది.

"సరేలే ఇప్పుడవన్నీ ఎందుకులేకాని, నీ మొహమేంటి అదోలా ఉంది" ప్రేమగా అడిగాడు.

"ఏం చెప్పమంటారులెండి. ఈరోజు మన రమ్య కాలేజినుండి ఏడుస్తూ వచ్చింది. ఏమైందే అంటే 'ఏం

కాలేదు' అంటుందే తప్ప మరోమాట మాట్లాడడంలేదు. దాని వాలకం చూస్తే నాకేదో భయంగా ఉందండి..విషయం తెలుసుకోవడానికి ఇప్పుడే అబ్బాయి చక్రం దాని రూములోకి వెళ్ళాడు. ఏం జరుగుతుందో నేను చూసి వస్తాను ఈ లోపు మీరు ఫ్రెష్ అవండి" అంటూ అక్కడినుండి రమ్య రూమువైపు వచ్చిన అన్నపూర్ణ చాటుగా అన్నాచెల్లెళ్ల సంభాషణ వినసాగింది.

ooo

"ఏంటమ్మా ఏమైంది. ఇందాక ఎందుకలా ఏడ్చావు" అనునయంగా అడిగాడు చక్రవర్తి.

"ఏం లేదన్నయ్యా"

## సంధ్య దశ తిరిగేనా?

'ప్రేమిస్తే' లాంటి సూపర్ హిట్ సినిమాలో నటించిన సంధ్య స్వతహాగా కేరళ కుట్టి. అయితే ఆమెకి తమిళ, తెలుగు సినిమా రంగాల నుంచి మొదట్లో పిలుపు వచ్చింది. కానీ ప్రస్తుతం ఆమెకి ఇక్కడ చెప్పుకోదగిన విజయాలు, ఆఫర్లు లేకపోయేసరికి నా మాతృభాషలో నటించడం నాకెంతో ఇష్టం అంటూ మలయాల సినీ జనాల్ని ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తోందిట. తాజాగా సంధ్య నటించిన రెండు మలయాళ చిత్రాలు విడుదలయ్యాయి. వీటి తర్వాత కూడా తను ఇక్కడే కంటిన్యూ అవాలనుకుంటున్నట్టు చిలకపలుకులు పలుకుతోందిట. మరి సంధ్య లక్ ఎలా వుందో?

"చెప్పమ్మా, ఎందుకా భయం అన్నిటికి నేనున్నా అర్థం నుగా"

అన్నపూర్ణలో ఆతృత క్షణక్షణానికి పెరిగిపోతోంది. తన రాకని వాళ్ళు పసిగట్టారని తెలియని అన్నపూర్ణ, రమ్య ఏం చెబుతుందా అని ఊపిరి బిగపట్టుకొని తిరిగి వినసాగింది.


"ఏం లేదన్నయ్యా, మా క్లాస్‌మేట్ రఘు లేడూ, అతను నేను ప్రేమించుకొంటున్నాము" చెప్పడం ఆపింది రమ్య.

"వెరీగుడ్.. తర్వాత"

"వాళ్ళింట్లో వాళ్ళకి మా పెళ్ళి ఇష్టం లేదుట"

"ఏం ఎందుకని"

"మనం వాళ్ళ అంతస్తుకి తగమట. మన కులం వాళ్ళ కులం వేరుట. పైగా నేను వాళ్ళబ్బాయిని మోసం చేసి పెళ్ళికి సిద్ధం చేసానని, నాదసలు మంచి క్యారెక్టరే కాదని, అతనితోనే కాకుండా వేరే ఇంకెవరితో కూడా సంబంధం ఉండవచ్చునని అన్నారుట. నాకైతే వాళ్ళ మాటలు విన్న వెంటనే చచ్చిపోవాలనిపించింది"



"ఊరుకోమ్మా! ఎవరో ఏదో అన్నంత మాత్రాన మనం ఇలా బాధపడిపోతే ఎలా? మన గురించి మనకి తెలిసిన తర్వాత మనం వేరొకరి మాటలు పట్టించుకోనవసరం లేదు. ఇంతకీ రఘు ఏమన్నాడు"

"ఏమంటాడు, అవసరమైతే తల్లితండ్రులను ఎదిరించైనా నన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడు" చెప్పింది రమ్య.

"సరేనమ్మా నీ పెళ్ళి అతనితోటే జరిగేలా చూస్తాను, నువ్వు నిశ్చింతగా ఉండు. అయితే నాకొక డౌటు"

"డౌటా! ఏంటన్నయ్యా?"

"అదేనమ్మా నీ పెళ్ళికి అమ్మానాన్న ఒప్పుకొంటారనే నమ్మకం నాకులేదు" ఓరగా అన్నపూర్ణ నిలుచున్న వైపు చూస్తూ అన్నాడు.

"ఏం అన్నయ్యా ఎందుకొప్పుకోరు, కూతురు సుఖం కన్నా వాళ్ళకి తమ పట్టింపులే ఎక్కువా?"

"అలా అని కాదమ్మా. అమ్మకి వేరేవాళ్ళ గురించి తక్కువగా అంచనా వెయ్యడం తప్ప మరొకటి తెలియదు. చెప్పినా చేసుకోదు. అన్నింటిలోను తాను, తన పిల్లలే గొప్ప, బైట వాళ్లంతా ఎందుకు పనికిరానివాళ్ళు, నీతి, జాతి లేనివాళ్ళు అన్న తప్పుడు అభిప్రాయం ఆమెలో ఉంది. నీ పెళ్ళికి వాళ్ళుగూడా వప్పుకుంటే, రఘువాళ్ళ నాన్నగారి కాళ్ళు పట్టుకొనైనా సరే నీ పెళ్ళి జరిపిస్తాను. అంతవరకు నువ్వు ఏ అఘాయిత్యం చెయ్యనని మాటియ్యి" అన్నాడు చెల్లిని దగ్గరగా తీసుకుంటూ

'భగవంతుడా! ఏమిటీ పరీక్ష. చెల్లెలు కూడా అన్న దారిలోనే వెళుతోంది. వెంటనే ఈ విషయం ఆయన చెవిన వెయ్యాలి' అని అక్కడి నుండి గాబరాగా వెళ్తున్న అన్నపూర్ణని చూసి అన్నా చెల్లిద్దరు ముసిముసిగా నవ్వుకొన్నారు.

ooo

"అయితే మీ అమ్మాయి మా అబ్బాయి ప్రేమించుకొన్నారు కాబట్టి వాళ్ళిద్దరికి పెళ్ళి చెయ్యలంటారు" కూతురు రమ్య పెళ్ళి విషయం మాట్లాడడానికి వచ్చిన రామారావుతో అన్నాడు రఘు తండ్రి అవధాని.

తలూపారు రామారావు దంపతులు.

"ప్రేమించుకున్నంత మాత్రాన పెళ్ళి చేసుకోవాలనే రూలేమైనా ఉందా?" అవధాని సూటిగా ప్రశ్నించాడు.

"పెద్దవారు, మీకు మేము వేరేగా చెప్పవలసిన అవసరం లేదు" వినయంగా అన్నాడు రామారావు.

"ఇంకా పెద్దరికం ఎక్కడ ఉండనిచ్చేరండి మీరు. మా అమ్మాయి మీ అబ్బాయిని ప్రేమించింది, పెళ్ళి చేయండి అంటూ సిగ్గులేకుండా, పిల్లని సరాసరి ఇక్కడికి తీసుకొని వచ్చారు. ఇదేనా మీరిచ్చే గౌరవం, మర్యాద. ఐనా తప్పు మావాడిదిలెండి. మీ పిల్లలో ఏం చూసి ప్రేమించాడో నాకర్థం కావడంలేదు. ఈ కాలంలో పిల్లలకు ప్రేమించుకోవడం ఓ ఫేషనైపోయింది. బుద్ధిగా చదువుకోమని చెప్పవలసిన తల్లితండ్రులే ఇలాంటి ప్రేమ వ్యవహారాల్ని ఎందుకు ప్రోత్సహిస్తున్నారో తెలియడంలేదు" అసహనంగా అన్నాడు అవధాని.

"చిత్తం, ఇందులో మా పిల్ల ప్రమేయం ఎంతుందో మీ పిల్లవాడి పాత్ర కూడా అంతే ఉంది. కాబట్టి మీరే దొడ్డమనసు చేసుకొని ఈ పెళ్ళి జరిపించాలి" అన్నాడు రామారావు.

"మీకేమండి మీరు ఎన్నైనా చెబుతారు. ఒక్క విషయం చెప్పండి మీరే కనక నా స్థానంలో ఉండి మీ అబ్బాయి వేరే అమ్మాయిని ప్రేమించాను అంటే మీరు ఆనందంగా ఆ పెళ్ళికి వప్పుకొంటారా?"

వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు రామారావు.

"అదీ.... అదీ... నేనైతే తప్పకుండా

వప్పుకుంటాను" బింకంగా అన్నాడు రామారావు.

"మీరామాట మనస్ఫూర్తిగా అంటున్నారా లేక గొప్పకోసం, మెప్పుకోసం అంటున్నారా?"

"మనస్ఫూర్తిగానే అంటున్నాను"

"అంటే మీ అబ్బాయి ఫలానా అమ్మాయిని ప్రేమించాను, పెళ్ళిచేసుకుంటాను అంటే తప్పకుండా వారి పెళ్ళి చేస్తారన్నమాట" మరొక్కసారి అడిగాడు అవధాని.

"తప్పకుండా చేస్తానని చెబుతున్నాను గదా. మావాడి మీద, నా పెంపకం మీద నాకా నమ్మకముంది. వాడెప్పుడు నామాట జవదాటడు" చక్రవర్తి వంక ధీమాగా చూస్తూ అన్నాడు రామారావు.

"మరైతే మీ అబ్బాయి ప్రేమించిన ఉష విషయంలో మీ నిర్ణయాన్ని ఎందుకు అమలు పర్చలేదు" సడన్‌గా అడిగాడు అవధాని.

ఊహించని ప్రశ్నకి కంగారుపడ్డ రామారావు దంపతులు చక్రవర్తివంక అనుమానంగా చూసారు.

"అదీ... అదీ..." నీళ్ళు నమిలాడు రామారావు.

"చూసారా విషయం మీ దగ్గరికి వచ్చేసరికి బాధగా ఉందికదా. ఆ అమ్మాయి కూడా మీ అమ్మాయిలాంటిదేనని ఎందుకు అనుకోలేకపోయారు. పైపెచ్చు ఆ అమ్మాయి మీద లేనిపోని అభాండాలు, నిందలు వేసారు. అసలు ఆ అమ్మాయి గురించి మీకేం తెలుసునని అన్నన్ని మాటలు అన్నారు. మీ అబ్బాయిని, అమ్మాయిని కంట్రోల్ చేసుకోలేని మీకు వేరే వాళ్ళని అనే అర్హత ఎక్కడిది. ముందు మీలోని లోపాలని సరిదిద్దుకొని, ఆపై బైటి వాళ్ళ లోపాలను ఎంచడానికి ప్రయత్నించండి. మనలో లోపాలు లేనప్పుడే, ఎదుటివాళ్ళ లోపాలను ఎత్తి చూపించే అర్హత వస్తుంది. ఇంకో విషయం రామారావుగారు! మనం ఎవరినైనా వేలెత్తి చూపించినప్పుడు, మన చేతిలోని మిగతా మూడువేళ్ళు ముందు మనలోని లోపాలను చూసుకోమని మనవంకే చూపిస్తాయి. ఆ విషయం మర్చిపోయి ప్రతి ఒక్కళ్ళు ఎదుటివారి లోపాలను ఎత్తి చూపడానికే ప్రయత్నిస్తారు. తాము తప్పించి అందరూ చెడ్డవాళ్ళు, ఎందుకు చేతకానివాళ్ళు అనే భావిస్తారు. మన బంగారం మంచిదైనప్పుడు వేరొకర్ని అనుకోవాల్సిన అవసరం ఏముంది"

"రామాయణంలో పిడకల వేటలా మధ్యలో ఆ అమ్మాయి విషయం ఎందుకు" అసహనంగా అన్నాడు రామారావు.

"ఎందుకంటే ఆ అమ్మాయి మా అన్నయ్య కూతురు కాబట్టి" సైలెంట్‌గా బాంబుని పేల్చాడు అవధాని.

"ఏంటి ఉష మీ అన్నయ్య కూతురా?" ఒకేసారి ఆశ్చర్యంతో అన్నాడు రామారావు దంపతులు.

"అవును ముమ్మాటికి మా అన్నయ్య కూతురే" అంటూ ప్రక్కగదిలోనే ఉన్న ఉషని వాళ్ళ ముందుకి పిలిచాడు.

"ఇప్పుడు చెప్పండి మీరన్న ప్రకారం మీరు వీళ్ళ పెళ్ళికి వప్పుకొని, ఆమెని మీ కోడలిగా స్వీకరిస్తారా?"

రామారావుకి ఏం చెయ్యాలో తెలియక భార్య అన్నపూర్ణవంక కోపంగా చూసాడు.

"అలా వదినగారి వంక ఎందుకండీ కోపంగా చూస్తారు. ఇంట్లో నిర్ణయం తీసుకోవలసింది దంపతులిద్దరూను" రామారావుని ఆటపట్టిస్తూ అన్నాడు.

"సరేనండి మేం ఈ పెళ్ళికి వప్పుకుంటాము. మరి మీరు మా అమ్మాయిని కోడలిగా స్వీకరిస్తారా?" తిరిగి అడిగాడు రామారావు.

"నాకు కొడుకులుంటే తప్పకుండా మీ అమ్మాయిని మా యింటి కోడలిగా చేసుకుంటాను" నవ్వుతూ అన్నాడు అవధాని.

"కొడుకులుంటే అంటున్నారు మీ మాటలు నాకు అర్థం కావడలేదు కొంచెం వివరంగా చెప్పకూడదా" ఉడుక్కుంటూ అన్నాడు రామారావు.

"ఏం లేదండి రామారావుగారు, నాకసలు కొడుకులే లేరు. ఉన్నది ఒక్కగానొక్క కూతురు శారద. మీ అమ్మాయి క్లాస్‌మేట్"

"మరి మా అమ్మాయి, మీ అబ్బాయి ప్రేమ... పెళ్ళి ఇవన్నీ" విషయం పూర్తిగా అర్థంగాని రామారావు అదే విషయం ఆయనను అడిగాడు.

"ఓ అదా... అదంతా మీ చక్రవర్తి, ఉషల పెళ్ళి జరగడం కోసం మీ అమ్మాయి, అబ్బాయి కలిసి మాచే ఆడించిన నాటకం. మీ పిల్లలే ముఖ్య సూత్రధారులు, మేం ఉత్త పాత్రధారులం మాత్రమే" నాటక ఫక్కీలో చెప్పాడు అవధాని.

విషయం పూర్తిగా అర్థం అయిన రామారావు దంపతులు "మీరు ఆడిన నాటకం ఒక విధంగా మా కళ్లను తెరిపించింది. ఇంతకాలం మేము మీరనుకొన్నట్లుగానే ఇతరుల గురించి ఎంతో అజ్ఞానంగా ఆలోచించాము. అందుకు ఎంతో సిగ్గుగా ఉంది" అంటూ తమ తప్పులను చాలా తెలివిగా తెలియజేసిన చక్రవర్తి, రమ్యల వంక అభినందపూర్వకంగా చూసారు.

## ఇక లారా వంతు

కరీనా కపూర్ ఇప్పుడు మునుపటి కంటే స్లిమ్ కనిపిస్తోంది. కారణం మరేం లేదుట.. డైటింగ్‌లు, ఎక్సర్‌సైజులు తెగ చేసేసి నాజుగ్గా తయారైంది. ఇలాగే ప్రియాంకా చోప్రా కూడా డైటింగ్, యోగా చేసేసి సన్నబడే మార్గంలో వుందిట. ఈ రూటులోకి మరో తార కూడా వస్తోంది. మామూలుగా కంటే తను మరీ బరువెక్కువగా వున్నానని గ్రహించిన లారాదత్తా స్లిమ్మింగ్ కార్యక్రమంలో ప్రస్తుతం బిజీగా వుందిట. ప్రస్తుతానికి చెప్పుకోదగిన సినిమాలు లేని లారాకి స్లిమ్మయ్యాక ఆఫర్లు ఎక్కువవుతాయేమో!

